




కన్నీటి సహవాసం.. మరుగుదొడ్డిలో నివాసం

- నిలువ నీడ కోసం వృద్ధురాలి వేదన
- శిథిలావస్థకు చేరిన 40 ఏళ్ల నాటి ఇల్లు

6

వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ కన్నుమూత

- కడుపునొప్పితో ఏఐజీలో చేరిక.. గుండెపోటుతో తుదిశ్వాస
- విద్యార్థి దశలో పీడీఎస్‌యూ నాయకుడిగా గుర్తింపు
- ఆ తర్వాత టీచర్ కొలువు..
- 2014లో ఎమ్మెల్యేగా ఎన్నిక





నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అజయ్, తదితరులు


వైరా, మే 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, వైరా మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్(62) మంగళవారం ఉదయం కన్నుమూశారు. హైదరాబాద్‌లోని నివాసంలో ఉంటున్న మదన్‌లాల్‌కు ఈ నెల 23న తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కుటుంబసభ్యులు ఆయన్ను అక్కడి ఏఐజీ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు ఆయన ఆరోగ్యం అప్పటికే క్షీణించినట్టు నిర్ధారించి.. చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఆయనను పరీక్షించిన వైద్యులు మరో రెండురోజుల అబ్జర్వేషన్ తర్వాత డిశ్చార్జ్ చేస్తామని కుటుంబసభ్యులకు తెలిపారు. కానీ ఈ లోపే మళ్లీ మంగళవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇక మదన్‌లాల్ భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి ఖమ్మంలోని ఆయన నివాసానికి తీసుకువచ్చారు.

2014నుంచి 2018వరకు మదన్‌లాల్ వైరా ఎమ్మెల్యేగా పనిచేసిన మదన్‌లాల్‌కు భార్య మంజుల, కుమారుడు ఐఏఎస్ మృగేందర్‌లాల్, కుమార్తె మనీషా లక్ష్మీ ఉన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని ఈర్లపూడి (మిగతా 6వ పేజీలో)

నేడు ఈర్లపూడిలో అంత్యక్రియలు

- హాజరుకానున్న బీఆర్ఎస్ నేత హరీష్‌రావు
- ఖమ్మంలో నివాళులర్పించిన మాజీ మంత్రి పువ్వాడ, ప్రముఖులు

6



రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులు.. పాముకాటు బాధితులు.. ఆత్మహత్యా యత్నం చేసిన వారు... కత్తిపోట్లకు గురైన వారు.. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఆసుపత్రికి వచ్చిన ఇతరత్రా రోగులకు అత్యవసర పరిస్థితిలో ప్రాథమికంగా వైద్యం అందించి. ప్రాణాలు కాపాడేది క్యాజువాలిటీ వైద్యులే. ప్రమాదం జరిగిన మొదటి గంటలో అందించే వైద్యమే ప్రాణాలను నిలబెడుతుంది. కానీ ఖమ్మం ఆస్పత్రిలో ఎంతో కీలకమైన క్యాజువాలిటీ విధులను కొందరు వైద్యులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మరి కొందరు బాధితులను చికిత్స కోసం కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ చేతులుదులుపు కొంటున్నట్టు ఆరోపణలున్నాయి.

అత్యవసరం.. విధులు అస్తవ్యస్తం!

- ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి క్యాజువాలిటీలో నిర్లక్ష్యం
- బాధితులకు సకాలంలో అందని వైద్యసేవలు
- కమీషన్ల కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్
- ఇందులో కొందరు వైద్యులు, సిబ్బంది పాత్ర

ఖమ్మం కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఏ ఆస్పత్రిలో అయినా క్యాజువాలిటీలో ఏ రోజు ఎవరు విధులు నిర్వహించాలనే విషయాన్ని ముందుగానే నిర్ణయిస్తారు. రోజూ మూడు షిఫ్టుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఒక్కరు. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8గంటల వరకు, రాత్రి 8గంటల నుంచి మరునాడు ఉదయం తొమ్మిది వరకు ముగ్గురు సీఎంవోలు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. అత్యవసర సమయంలో వైద్యులు క్యాజువాలిటీలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఎవరికి కేటాయించిన, సమయంలో వారే పని చేయాల్సి ఉంటుంది. కానీ ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో సీనియర్ రెసిడెంట్(ఎస్సార్‌లు), డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాం(డీఆర్పీ) సభ్యులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సొంతంగా నర్సింగ్ హోంలు, క్లీనిక్‌లు కలిగి ఉన్న వైద్యులు నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాల్సి ఉన్నా తమకు బదులుగా మరో వైద్యుడిని నియమించుకుని ఇక్కడి విధులకు ఎగనామం పెడుతున్నారు. ఈ సమయంలో వారి సొంత నర్సింగ్ హోంలు, క్లినిక్‌లలో ప్రాక్టీస్ చేసుకుంటున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతే కాదు కిందిస్థాయి సిబ్బందిపై బాధ్యతలు అప్పగించి వెళ్లిపోతున్నారని వాపోతున్నారు. శాశ్వత ప్రాతిపదికన ఈ విభాగంలో వైద్యుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు.

మెడికో లీగల్ కేసులకు బాధ్యులెవరు?

ఈ విభాగంలో క్షతగాత్రులకు, మెడికో లీగల్ కేసుల్లో వైద్యం చేసిన వైద్యులు కొన్ని సమయాల్లో ఇరకాటంలో పడాల్సి వస్తోంది. మెడికల్ రికార్డుల్లో కేస్‌షీట్‌లో నమోదైన వైద్యులు లేకపోవడంతో కోర్టు కేసులకు సంబంధించిన అంశాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో క్యాజువాలిటీ విధులు నిర్వహించే సీఎంవోలు తప్పని సరిగా పోస్టుమార్టం విధులు నిర్వర్తించాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం మెడికల్ కళాశాల పరిధిలోకి వెళ్లిన తర్వాత ఆ బాధ తప్పినట్లైంది. ప్రస్తుతం పోస్టుమార్టం నిర్వహించే బాధ్యతలను ఫోరెన్సిక్ వైద్యులను ప్రత్యేకంగా నియమించారు. రెండేళ్లగా ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆ విధులను నిర్వహిస్తున్నారు. కానీ క్యాజువాలిటీలో మాత్రం అత్యవసర సేవలు మాత్రం నిర్వహించడంలో వైద్యులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ రోగులు ఆవేదన చెందుతున్నారు. క్యాజువాలిటీ డ్యూటీ అంటేనే కత్తిమీద సాము లాంటిది. అత్యవసరంగా వచ్చే రోగులకు ఇక్కడ సేవలు అందకపోవడంతో సర్కారు వైద్యంపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆస్పత్రి వైద్యులు క్యాజువాలిటీలో సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.



క్యాజువాలిటీలో తమ వంతు కోసం నిరీక్షిస్తున్న రోగులు

కమీషన్ల కోసం కక్కుర్తి..

ఏరియా ఆసుపత్రుల్లో ఏ రోగికి ప్రాణం మీదకు వచ్చినా జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా 108 అంబులెన్స్ క్షతగాత్రులను మెదట జిల్లా ఆసుపత్రికే తీసుకువస్తారు. ఇక్కడి. వైద్యం నచ్చని వారు క్యాజువాలిటీ నుంచి ప్రైవేట్ ఆసుపత్రికి వెళతారు. ఇదే అదనుగా భావించిన కొందరు వైద్యులు, సిబ్బంది, వార్డుబాయ్స్, అంబులెన్స్ డ్రైవర్లు కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తూ కమీషన్లు తీసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన వారిని వారి సొంత ఆస్పత్రులకు కూడా మళ్లించుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నేడు జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన

- రేపు ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష
- మంత్రి కోమటిరెడ్డితో కలిసి హాజరవనున్న తుమ్మల

ఖమ్మం కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30కి హైదరాబాద్‌లో బయల్దేరి 11 గంటలకు నల్లగొండ జిల్లా చిట్యాలలో ఓ కార్యక్రమంలో పాల్గొననున్న ఆయన సాయంత్రం 5.30కి 29వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. 5.45కి 41వడివిజన్‌లో వైరా రోడ్డులో ఏర్పాటు చేసిన మహిళామార్ట్‌ను ప్రారంభిస్తారు. అలాగే 29న ఉదయం 10గంటలకు ఇందిరమ్మ ఇళ్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగే ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి హాజరవుతారు. 30వ తేదీన ఉదయం 9గంటలకు ఖమ్మం నుంచి సూర్యాపేటలో జరిగే ఆ జిల్లా సమీక్షకు హాజరై.. అనంతరం మధ్యాహ్నం 3గంటలకు తల్లాడ రేంజ్ పరిధిలోని కనకగిరి హిల్స్‌ను సందర్శించనున్నారు.

పలువురు ఎస్సైలకు స్థాన చలనం

ఖమ్మం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ సునీల్‌దత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎన్. వెంకటకృష్ణను తల్లాడకు, తల్లాడలో పనిచేస్తున్న బి.కొండలరావును ఖమ్మం త్రీటౌన్‌కు, సత్తుపల్లిలో పనిచేస్తున్న టి.కవితను వేంసూరుకు, వేంసూరులో పనిచేస్తున్న ఎస్.వీర ప్రసాద్‌ను ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. అలాగే సీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఎం.రవిని చింతకాని పోలీస్ స్టేషన్‌కు, ఇప్పటివరకు చింతకానిలో పనిచేస్తున్న నాగుల్‌మీరాను సీసీఆర్‌బీకి, వీఆర్‌లో ఉన్న కె. మధుబాబును ఖానాపురంహవేలికి, పి.వెంకటేష్‌ను ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు.



భళా.. మహిళ

- కార్పొరేట్ మార్టులకు దీటుగా మహిళా మార్టు
- సెర్ప్‌లో 20, మెప్మాలో ఏడు రకాల ఉత్పత్తులు
- ఏడాది వరకు పదార్థాలకు పురుగు పట్టకుండా వ్యాక్యూమ్ ప్యాకింగ్
- ప్రత్యేక చొరవ తీసుకున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- నేడు ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాల్లోనే ఖమ్మం జిల్లా మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇక్కడి మహిళా సంఘాలను ఆదర్శంగా నిర్వహించటంతో పాటు వినూత్నంగా చేతి ఉత్పత్తుల తయారీ, అమ్మకాలను జరిపారు. జాతీయ స్థాయిలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలు ఏర్పాటు చేసి మామిడి, మిర్చి, మొక్కజొన్న ఇతర వాణిజ్య పంటలను కొనుగోలు చేసి వాటిని జాతీయ స్థాయిలో అమ్మకాలు నిర్వహించడంలోనూ ఖమ్మం మహిళా సంఘాలది ప్రత్యేక శైలి. ఈ క్రమంలోనే కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మహిళా సంఘాలను కార్పొరేట్ స్థాయిలో ప్రోత్సహించేందుకు కార్యాచరణ చేశారు. మహిళా (మిగతా 6వ పేజీలో)

ఎరువుల దిగుమతిలో జాప్యం

- సమీపించిన వానాకాలం సాగు సీజన్
- విత్తనాలు, ఎరువుల కోసం రైతుల పరుగులు
- ఇంకా ఉమ్మడి జిల్లాకు సరిపడా అందని ఎరువులు
- దిగుమతి పాయింట్‌ను పందిళ్లపల్లికి మార్చడమే కారణం
- మరింత ఆలస్యమైతే 'బ్లాక్' విక్రయాలు పెరుగుతాయని రైతుల ఆందోళన

ఖమ్మం, మే 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈసారి వానాకాలం సీజన్ కాస్త ముందుగానే ప్రారంభం కావడంతో రైతులు ఖరీఫ్ సాగుపై దృష్టిపెట్టారు. ముఖ్యంగా మెట్ట సాగు రైతులు పత్తి విత్తనాలు విత్తేందుకు భూములు సిద్ధం చేస్తున్నారు. కానీ వానాకాలం సీజన్‌కు సరిపడా ఎరువులు ఇంకా జిల్లాకు చేరకపోవడంతో ఎరువుల కొరత ఏర్పడుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సరిపడా పత్తి, మిర్చి, పెసర మొక్కజొన్న, కంది, పిల్లిపెసర, జనుము, పచ్చిరొట్ట ఎరువులు విత్తనాలు సిద్ధంచేశారు. అయితే డిమాండ్ తగినన్ని ఎరువులు మాత్రం జిల్లాకు ఇంకా చేరలేదు. రైతులు దుక్కుల్లో డీఏపీ వంటి కాంప్లెక్స్ ఎరువులతో పాటు విత్తనాలు



(ఫైల్)

వేసిన వెంటనే యూరియాను వినియోగిస్తారు. కానీ జిల్లాకు ఇంకా పూర్తిస్థాయిలో ఎరువుల దిగుమతి జరగలేదు. ఖరీఫ్‌కు అవసరమైన ఎరువుల కోసం జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు.

దిగుమతి పాయింట్‌ను మార్చడమే కారణం..

గతంలో ఉమ్మడి జిల్లాతో పాటు పరిసర జిల్లాలకు అవసరమైన ఎరువులను రైల్ ర్యాక్‌ల ద్వారా ఖమ్మం రైల్వే స్టేషన్‌లోని దిగుమతి పాయింట్ వద్ద దిగుమతి చేసుకొని ఎరువులను లారీ ద్వారా నిర్దేశిత ప్రాంతాలకు తరలించేవారు. అయితే ప్రస్తుతం ఖమ్మం రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులతో పాటు మూడో లైన్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఎరువుల దిగుమతి పాయింట్‌ను ఖమ్మం రైల్వేస్టేషన్ నుంచి పందిళ్లపల్లికి మార్చారు. దాంతో అక్కడ దిగుమంతికి అవసరమైన వసతుల కల్పనలో జాప్యం జరగడంతో ఎరువుల దిగుమతి ఆలస్యమవుతోంది. ఖమ్మం జిల్లాకు 95,600మెట్రిక్ టన్నుల యూరియా కావాలని ప్రతిపాదించగా ఇప్పటి వరకు కేవలం 2వేల మె.ట మాత్రమే వచ్చింది. డీఏపీ 45,500 మె.టన్నులకుగాను 1600మె.టన్నులు, ఎంవీవో(పొటాష్) 30,300 మె.టన్నులకు గాను 520మె. టన్నులు, 75,800మె.టన్నులకగాను 5,600మె.టన్నులు, ఎస్ఎస్‌పీ 60వేల మె.టన్నులకు గాను 1,200మె.టన్నులు మాత్రమే దిగుమతి అయ్యింది. ప్రస్తుతం ఆరు ర్యాక్‌ల ద్వారా జిల్లాకు ఎరువులు వచ్చినా వాటిని భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబద్ జిల్లాలకు పంపుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలతో కూడిన ఆ జిల్లాల్లో వర్షాకాలంలో వాగులు పొంగితే రైతులు ఎరువులు తీసుకునేందుకు ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో ముందుగా ఆయా జిల్లాలకు ఎరువులను తరలిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కూడా డిమాండ్‌కు తగ్గట్లు ఎరువులు రాలేదు. చెన్నై గుజరాత్, కాకినాడ (మిగతా 6వ పేజీలో)

వెంగళరావు ప్రాజెక్టు అలుగు పునర్నిర్మాణం ఎప్పుడో?

7

పోడు భూమి.. పట్టా వివాదం

- 20ఎకరాల్లో ఫారెస్టు భూమిని ఆక్రమించే యత్నం..
- అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు.. కట్టుమల్లారంలో ఉద్రిక్తత



ఖమ్మంలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

- సాగుకు సన్నద్ధమైన రైతుల్లో ఆనందం
- భూములను సిద్ధం చేసే పనుల్లో నిమగ్నం

వివరాలు : 6లో

సీఎంతో వీసీకి కలెక్టర్ల హాజరు..



సీఎంతో వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన కలెక్టర్, అధికారులు

ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం తన కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావులతో కలిసి నిర్వహించిన ఈ వీసీలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, భద్రాద్రికొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సర్కారు చేపట్టిన కార్యక్రమాలు, పథకాల అమలులో కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సీఎం వారికి సూచించారు.

- ఖమ్మం కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి)

భళా.. మహిళ


మహిళలు తయారు చేసిన బొమ్మను అందుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

(5వ పేజీ తరువాయి)

క్యాంటీన్లు ఏర్పాటు చేసి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేకతను చాటారు. ఎక్కడైనా ప్రత్యేకమైన స్టాళ్లలో మాత్రమే కనిపించే మహిళా ఉత్పత్తులను రోజూ ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు, వాటిని తయారు చేసిన మహిళలు నేరుగా అమ్మకాలు జరిపేందుకు నిర్ణయించారు. ఇందుకోసం ఖమ్మం ప్రధాన రహదారిలో మహిళా మార్టు ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధిలోని సెర్ప్ మహిళా సంఘాలు, పట్టణాల్లోని మెప్మా మహిళా సంఘాలను ఐక్యంగా మహిళా మార్టుకు శ్రీకారం చుట్టారు. పలుమార్లు కలెక్టర్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించారు. మార్టును సందర్శించి పలు సూచనలు చేశారు.

పలు ఆహార ఉత్పత్తులతో మహిళా మార్టు

మహిళా మార్టులో మహిళలు స్వయంగా చేతితో చేసిన నాణ్యమైన, కల్తీ లేని ఆహార ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. ప్రస్తుత సమాజంలో కల్తీ పసుపు, కల్తీ కారంతో అనేక క్యాన్సర్ కేసులు నమోదు జరుగుతుండటంతో కల్తీ లేని కారం, పసుపును నేరుగా అమ్మకాలు చేయనున్నారు. సేంద్రియ సాగు విధానంలో పండించిన పెసలు, పల్లీలు, కందులు, జొన్నలు, సజ్జలు, రాగులు, మినుములు వాటి పిండి పదార్థాలను అందుబాటులో ఉంచారు. ఆర్గానిక్ బియ్యంలో బ్లాక్, బ్రౌన్, రెడ్ బియ్యం ఉంచారు. వాటితో పాటుగా కొర్ర బియ్యం మార్టులో ఏర్పాటు చేశారు. జ్యూట్ బ్యాగ్‌లు, మిల్లెట్ స్నాక్స్, సంప్రదాయ పిండి వంటకాలు, నూనెలు, ఫ్యాన్సీ వస్తువులు, మట్టి కుండలు, నేత చీరలు, దుస్తులు, ఫినాయిల్, పేపరు కప్పులు ఇంకా చాల చేతి ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు.

పురుగు పట్టకుండా.. ఏడాది వరకు తాజాగా..

మహిళా మార్టులో మహిళా ఉత్పత్తులను వ్యాక్యూమ్ ప్యాకింగ్ మిషన్ ద్వారా ప్యాకింగ్ చేస్తారు. ఇలా ప్యాకింగ్ చేయటం ద్వారా ప్యాకింగ్‌లో ఎటువంటి గాలీ ఉండదు, ఆ పదార్థాలు ఏడాది వరకు చెడి పోకుండా తాజాగా ఉంటాయి.

స్వయం సహాయక సంఘాలకు ఉపాధి

ఖమ్మంలో ఏర్పాటు చేసే మహిళా మార్టుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు ఉపాధి కలగనుంది. ఖమ్మం నగరంలోని మెప్మా పరిధిలో ప్రగతి ఎస్‌హెచ్‌జీ, వనశ్రీ ఎస్‌హెచ్‌జీ, సమీనా ఎస్‌హెచ్‌జీ, వీరాజంనేయ ఎస్‌హెచ్‌జీ, సాయిబాబా ఎస్‌హెచ్‌జీ, సాయిదీపిక ఎస్‌హెచ్‌జీ, లక్ష్మీగాయత్రీ ఎస్‌హెచ్‌జీలు మహిళా మార్టులో తమ ఉత్పత్తులను ఏర్పాటు చేశారు. సెర్ప్ ఆధ్వర్యంలో చింతకాని, రఘునాథపాలెం, కామేపల్లి, సత్తుపల్లి, ఖమ్మం రూరల్, కల్లూరు, తిరుమలాయపాలేం, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల మహిళా సంఘాలు తమ ఉత్పత్తులను ఏర్పాటు చేశారు.

పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టును కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం పరిశీలించారు. మహిళా సంఘాలు ఎలాంటి ఉత్పత్తులను ఏర్పాటు చేశాయని విషయాలను స్వయంగా పరిశీలించారు. ఆర్గానిక్ ఉత్పత్తులపై ఆరా తీశారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సన్యాసయ్య, మెప్మా డీఎంసీ సావల సుజాతను అడిగి తెలుసుకున్నారు. మహిళా మార్టుకు వచ్చే ప్రజలకు సరైన పార్కింగ్ అందుబాటులో ఉంచాలని సూచించారు.

నేడు ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

ఉమ్మడి రాష్ట్ర సమయంలో మంత్రిగా, ప్రజాప్రతినిధిగా ఖమ్మం జిల్లా డ్వాక్రా సంఘాలకు అధిక ప్రాధాన్యమిచ్చి వారికి ఆర్థికంగా స్వయం సహాయక వ్యాపారాల నిర్వహణలో అండగా నిలిచిన ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ఖమ్మంలో మహిళా మార్టును బుధవారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ అభిషేక్ అగస్త్య ఆధ్వర్యంలో పూర్తి ఏర్పాట్లు చేశారు.

కన్నీటి సహవాసం.. మరుగుదొడ్డిలో నివాసం

- కడుపున పుట్టిన వారికి పట్టింపులేదు
- కాటికి కాలు చాపిన వయస్సులో నీడ కరువు
- శిథిలావస్థకు చేరిన 40 ఏళ్ల నాటి ఇల్లు
- తలదాచుకోవడానికి దిక్కయిన ఉపాధి హామీలో నిర్మించిన టాయిలెట్

ఎర్రుపాలెం, మే 27(ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు చెందిన దర్శనాల దర్గమ్మ నిలువ నీడ లేదు. నిత్యం కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన మరుడుదొడ్డిలోనే భోజనం చేస్తూ, నివాసం ఉంటోంది. ఈ నీరుపేద వృద్ధురాలి భర్త ఎప్పుడోకాలం చేశాడు. కట్టుకున్న భర్త కాలం చేశాడు. కనిపెంచిన పిల్లలు పట్టించుకోవడం లేదు. కాటిక కాళ్ల చాపిన వయస్సులో తినడానికి తిండి లేదు. పైగా తలదాచుకునేందుకు నిలవ నీడలేదు. దీనికితోడు కొడుకు మద్యానికి బానిస కావడంతో, అతడిని సైతం సాదుకుంటూ అత్యంత దుర్భర జీవనం గడుపుతోంది. ఆమె కేవలం ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛన్ ఆధారంగా బతుకు వెళ్లదీస్తున్నది. నివాసం ఉంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరడంతో, చేరదీసే దిక్కులేక మరుగుదొడ్డినే ఇల్లుగా మార్చుకుని జీవిస్తోంది. ఆమె పరిస్థితిచూసి జాలిదలిచి వాళ్లేకాని, కనకరించేవారు కరువయ్యారు. ముడతలు తొడిగిన శరీరంతో వేలిముద్రలు పడక ఎదేళ్లనుంచి ప్రభుత్వ ఇచ్చే రేషన్ బియ్యం కూడా అందడంలేదు.




మరుగుదొడ్డిలో నివాసం ఉంటున్న దుర్గమ్మ

దుర్గమ్మ దయనీయ జీవితం

దర్శనాల దర్గమ్మ వయస్సు 80 సంవత్సరాల పైగానే ఉంటుంది. చిన్న వయస్సులోనే భర్త భద్రయ్యను కోల్పోయింది. గత పదేళ్ల క్రితం వరకు కులవృత్తినే నమ్ముకుని గ్రామలో దోబీ పనులు చేసుకుంటూ జీవించింది. వయస్సుమీద పడడంతో పనిచేసే ఓపిక లేక శరీరం సహకరించక ఇంట్లోనే ఉంటోంది. తోటివారు తెలిసినవారు ఎంతో కొంత సాయం చేస్తుంటే పొట్టనింపుకుని పూట గడుపుతోంది.. దుర్గమ్మకు ఒక కొడుకు వెంకటేశ్వర్లు, కూతురు నాగమణి ఉన్నారు. వారి పెళ్లయ్యాక ఒంటరి జీవనం సాగిస్తూ బతుకుతోంది. కొడుకు వెంకటేశ్వర్లు మద్యానికి బానిసై భార్యపిల్లల్ని వదలి దుర్గమ్మ దగ్గరే ఉంటున్నాడు వృద్ధాప్యంలో తల్లీ ఆలనాపాలనా చూడాల్సిన కొడుకు తల్లిమీదనే ఆధారపడి ఆమెకు భారమయ్యాడు. 40 ఏళ్లక్రితం ఎమ్మెల్యే కోటాలో అప్పటి ప్రభుత్వం తనకు ఇంటిని నిర్మించి ఇచ్చింది. కాలక్రమేణా ఆ ఇల్లు పాడుబడిపోవడంతో దుర్గమ్మ నిరాశ్రాయురాలయింది. పదేళ్ల క్రితం సర్పంచ్ ఆమె వయోభార యాతన చూడలేక మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీపథకం కింద మరుగుదొడ్డిని నిర్మించారు. ప్రస్తుతం అదే మరగుదొడ్డిని ఆవాసంచేసుకుని దానిలో నివాసం ఉంటోంది. మనసున్న మారాజులు సాయం చేస్తే తప్ప పూటగడవని ఆమెకు ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌బియ్యం అందినా చాలు అని స్థానికులు చెబుతున్నారు. దాతలెవరైనా సాయం అందిస్తారని దీనంగా ఎదురుచూస్తోంది.


శిథిలమైన దుర్గమ్మ ఇల్లు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి బాగం హేమంతరావు

నంబాల ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేపట్టాలి

- వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు నాయకుల మృతదేహాలను బంధువులకు ఇవ్వకపోడంపై వామపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు మండిపడ్డారు. మంగళవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో వారు ఉమ్మడిగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌ను సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాల ఎదుట కేంద్ర బలగాలు నృత్యాలు చేశాయని ఆరోపించారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎంఎఫ్ గోపినాథ్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, ఎన్డీ నాయకులు లక్ష్మీనారాయణ, ప్రజాసంఘాల నాయకులు కాకి భాస్కర్, ఐవీ రమణారావు, చిర్రా రవి, రవి మారుత్ పాల్గొన్నారు.

పరిహారం తీసుకున్న ఇళ్ల తొలగింపు

- రామాలయ అభివృద్ధి పనుల కోసం ...
- నేటినుంచి రంగంలోకి దిగనున్న ఆర్అండ్‌బీ శాఖ

భద్రాచలం, మే 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం స్థలాన్ని సేకరిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే 40 ఇళ్ల తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే 32 మందికి భూసేకరణ చట్టం కింద పరిహారం చెల్లించారు. పరిహారం తీసుకున్న ఇంటి యజమానులు ఇప్పటికే ఖాళీ చేయడంతో బుధవారం నుంచి ఆర్.అండ్.బి. శాఖ ఆధ్వర్యంలో బహుళ అంతస్తు భవనాలు తొలగించనున్నారు. ఇందుకోసం రెండు పొక్లెయినర్లను వినియోగించనున్నట్లు రెవెన్యూ అధికార వర్గాలు తెలిపాయి. గత మూడు రోజుల నుంచి పరిహారం తీసుకున్న ఇళ్ల యజమానులు తమ సామాగ్రిని తీసుకోవడమే కాకుండా తలుపులు, కిటికీలు ఇతర ఫర్నీచర్‌ను ఇంటి నుంచి తొలగించి మరో చోటకి తరలించారు. అయితే ఇంకా ఎనిమిది మంది పరిహారం తీసుకోలేదని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ప్రభుత్వం ఏ విధంగా పరిష్కరిస్తారోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

ఎరువుల దిగుమతిలో జాప్యం

(5వ పేజీ తరువాయి)

తదితర ప్రాంతాల నుంచి ఎరువులు జిల్లాకు వస్తున్నాయి. ఇకనైనా వ్యవసాయ అధికారులు త్వరపడి ఉమ్మడి జిల్లాకు అవసరమైన ఎరువులను దిగుమతి చేయాలని రైతులు కోరుతున్నారు.

విత్తన ప్రణాళిక ఇలా..

ఖమ్మం జిల్లాలో వానాకాలం సీజన్‌లో 5,80,232 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు చేపట్టనున్నట్లు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో వరి 3,04,869 ఎకరాలు ఉండగా 76,217 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉందని వ్యవసాయశాఖ గుర్తించింది. మొక్కజొన్న 3,453 ఎకరాలకుగాను 863క్వింటాళ్ల విత్తనాలు, పత్తి 2,14,490 ఎకరాలకు 4,29,381 విత్తనలప్యాకెట్లు, వేరుశనగ 950 ఎకరాలకు 950 క్వింటాల్ల విత్తనాలు, అలాగే పెసర 165 ఎకరాలు, పిల్లిపెసర 1,952 ఎకరాలు, కంది 652 ఎకరాలు, మిర్చి 53,442 ఎకరాల్లో సాగుకు విత్తనాలు సిద్ధం చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6,31,124 ఎకరాల్లో పంటలు సాగవుతాయిన ప్రణాళిలు సిద్ధం చేయగా అందులో వరి 1,60,956 ఎకరాలకు గాను 41,489 క్వింటాళ్ల విత్తనాలు, మొక్కజొన్న 86,544 ఎకరాలకు గాను 6,924 క్వింటాళ్ల విత్తనాలు, పత్తి 2,04,632 ఎకరాలకు గాను 4,09,254 ప్యాకెట్లును సిద్ధం చేశారు.. వేరుశనగ 2,791 ఎకరాలుకగాను 1,675 క్వింటాళ్ల విత్తనాలు, మినుము 857 ఎకరాలకు గాను 69క్వింటాళ్లు, పెసర 131 ఎకరాలనకు గాను 10 క్వింటాళ్ల విత్తనాలు, కంది 1,159 ఎకరాలకుగాను 46క్వింటాళ్ల విత్తనాలు, మిర్చి 10,449 ఎకరాలకుగాను 10క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేశారు. వర్షాలు కొనసాగితే రైతులు విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎరువుల అవసరం కూడా ఒకేసారి వచ్చి పడే అవకాశం ఉండడంతో అధికారులు ఉమ్మడి జిల్లాకు సరిపడా ఎరువులను ఈనెలాఖరులోగా గోదాంలకు చేర్చితేనే బ్లాక్‌మార్కెట్ బాధలు లేకుండా రైతులకు విత్తనాలు అందే అవకాశం ఉంటుంది.

గిరిజన మహిళా సమాఖ్యల ద్వారా ఇసుక ర్యాంపులు


సమావేశంలో మాట్లాడుతున్న భవిష్య మిశ్రా

- మైనింగ్‌శాఖ ఎండీ భవేష్ మిశ్రా

కొత్తగూడెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : పెసా చట్టం ప్రకారం భద్రాద్రి జిల్లాలో మహిళా సమాఖ్యల ద్వారా ఇసుక ర్యాంపుల ఏర్పాటు, నిర్వహణకు చర్యలు చేపట్టాలని మైనింగ్‌శాఖ ఎండి భవిష్య మిశ్రా అన్నారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గిరిజన సమాఖ్యల ద్వారా ఇసుక ర్యాంపుల ఏర్పాటు, నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఏటూరునాగారం (ములుగు) ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాతో కలిసి టీజీఎండీసీ, ఐటీడీఏ మైనింగ్ శాఖాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లాలోని ఇసుక ర్యాంపుల వివరాలు, ప్రస్తుతం ఇసుకర్యాంపుల నిర్వహణలో చేపడుతున్న పద్ధతులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మైనింగ్‌శాఖ ఎండీకి వివరించారు. అనంతరం మైనింగ్ శాఖ ఎండీ భవేష్ మిశ్రా మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన సొసైటీల ద్వారా ఇసుక ర్యాంపుల నిర్వహణ చేపట్టడం ద్వారా గిరిజన కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది వారి జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. గిరిజన మహిళా సంఘాల ద్వారా ఇసుక ర్యాంపుల నిర్వహణకు ఐటీడీఏ ద్వారా అవసరమైన వాహణాలు, యంత్ర పరికరాలు సమకూర్చడం జరుగుతుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 8, ములుగు జిల్లాలో మూడు ఇసుక ర్యాంపులు ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలు మధు, దామోదర్ రావు, స్పెషల్ ఆఫీసర్ అశోక్‌కుమార్, తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజరు శంకర్‌నాయక్, ఏడీ మైన్స్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

ఖమ్మం, మే 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) / కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలుచోట్ల మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం పడింది. ఉదయం నుంచి ఉక్కపోత ఉండగా సాయంత్రం ఒక్కసారిగా భారీవర్షంపడింది. దీంతో పలుచోట్ల రోడ్లపై నీరు భారీగా ప్రవహించింది. ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని పాలేరు, మధిర,వైరా నియోజకవర్గాల్లో వర్షం అధికంగా పడింది. భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంతో పాటు జూలూరుపాడు, భద్రాచలం, మణుగూరు తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. ఇప్పటికే రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు.. దుక్కులు దున్నడం, భూములను సాగుకు సిద్ధం చేసే పనిలో నిమగ్నం కానున్నారు. ఈ వర్షం పిల్లిపెసర, పెసర లాంటి పచ్చిరొట్ట పంటలతోపాటు పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేసేందుకు ఉపయోగపడనుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వ్యవసాయశాఖ విత్తనాలను రైతులకు అందుబాటులోకి తెస్తుండగా.. మరోవైపు ప్రైవేట్ డీలర్ల నుంచి కూడా విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

వైరా మాజీ ఎమ్మెల్యే

మదన్‌లాల్ కన్నుమూత


మదన్‌లాల్ భౌతికకాయం

(5వ పేజీ తరువాయి)

గ్రామంలో 1963 మే3వతేదీన బాణోతు గోపాల్‌నాయక్, లక్ష్మీరంగమ్మ దంపతులకు మొత్తం 12మంది సంతానం కాగా వారిలో ఏడుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలున్నాయి. వారిలో మదన్‌లాల్ మూడో సంతానం. ఇక మదన్‌లాల్ కుమారుడు, ఐఏఎస్ అధికారి మృగేందర్‌లాల్ తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జీఎస్టీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కోడలు శ్వేత కూడా ఐఏఎస్ అధికారి. ఆమె కూడా కోయంబత్తూర్‌లోనే జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. కుమార్తె మనీషా లక్ష్మీకి అశోక్‌తో వివాహం కాగా.. అల్లుడు అశోక్ నాగపూర్‌లోని సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నారు. భార్య మంజుల గృహిణిగా ఉన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి నుంచి రాజకీయ నాయకుడిగా..

బీఏ, టీటీసీ చదివిన లంబాడా (బంజారా) సామాజిక వర్గానికి చెందిన మదన్‌లాల్ 1983నుంచి 1985వరకు కామేపల్లి మండలం అబ్బాస్ గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆ తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేశారు. 1989లో జరిగిన పోలీస్ ఎస్ఐ సెలెక్షన్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి ఎస్ఐగా సెలెక్ట్ అయ్యారు. అయితే కాలేజీ రోజుల్లో పీడీఎస్‌యూలో పనిచేసిన సమయంలో తనపై ఉన్న కేసులతో ఎస్ఐ ఉద్యోగానికి అనర్హుడయ్యారు. ఆసమయంలో ఖమ్మం జడ్పీచైర్మన్‌గా ఉన్న చేకూరి కాశయ్యతో కలిసి అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లారు. మదన్‌లాల్ ఎస్ఐ ఉద్యోగం గురించి కాశయ్య ఎన్టీఆర్‌కు వివరించారు. దాంతో మదన్‌లాల్ ప్రతిభను గుర్తించి అభినందించిన ఎన్టీఆర్.. ఎస్ఐ ఉద్యోగం గురించి పరిశీలించాలంటూ నాటి డీజీపీకి సూచించారు. అయినప్పటికీ విద్యార్థిగా ఉన్న సమయంలో ఉన్న కేసుల కారణంగా ఎస్ఐగా ఎంపిక కాలేకపోయారు. ఆతర్వాత రాజకీయాల వైపు ఆకర్షితులైన మదన్‌లాల్.. దివంగత మాజీమంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డికి ప్రధాన అనుచరుడిగా కొనసాగారు. మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్ తదితర నాయకులతో కూడా సత్సంబంధాలు కొనసాగించారు. యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్‌లోని పలు పదవుల్లో కొనసాగారు. మొదటిసారి 1995లో కాంగ్రెస్ నుంచి ఈర్లపూడి ఎంపీటీసీగా మదన్‌లాల్ గెలిచారు. ఆకొద్ది కాలానికే ఆపదవికి రాజీనామా చేసి ఈర్లపూడి సర్పంచ్‌గా ఎన్నికై 1996నుంచి 2001వరకు పనిచేశారు. 2001నుంచి 2006వరకు ఆయన సతీమణి మంజుల సర్పంచ్‌గా పనిచేశారు. ఆతర్వాత 2006లో మళ్లీ మదన్‌లాల్ సర్పంచ్‌గా ఎన్నికై 2011వరకు పదవిలో కొనసాగారు.

అయితే 2007లో నియోజకవర్గాల పునర్విభజనలో వైరా(ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పుడు ఈర్లపూడి సర్పంచ్‌గా ఉన్న మదన్‌లాల్ ఎమ్మెల్యేగా పోటీకి ప్రయత్నాలు ప్రారంభించి.. తొలిసారి 2009లో కాంగ్రెస్ నుంచి పోటీకి ఆసక్తి చూపారు. కానీ కాంగ్రెస్ అధిష్ఠానం తనను కాదని డాక్టర్ భూక్యా రామచంద్రనాయక్‌కు టికెట్ కేటాయించడంతో తిరుగుబాటు చేసిన మదన్‌లాల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 5,551ఓట్లు మాత్రమే వచ్చాయి.

ఇక ఆ తర్వాత 2014లో సీపీఎం మద్దతుతో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మదన్‌లాల్ సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి బాణోతు బాలాజీ నాయక్‌పై 10,583ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆ ఎన్నికల్లో మదన్‌లాల్‌కు 58,940ఓట్లు రాగా బాలాజీకి 48,4115ఓట్లు వచ్చాయి. అనంతర పరిణామాల్లో బీఆర్ఎస్‌లో చేరిన మదన్‌లాల్ 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగి ఓటమిపాలయ్యారు. మొత్తం వైరా నియోజవర్గం నుంచి నాలుగుసార్లు పోటీ చేసిన ఆయన ఒకసారి మాత్రమే విజయం సాధించారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత కాస్త స్తబ్దుగా ఉన్న మదన్‌లాల్ ఇటీవల జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సమయంలో కాస్త క్రియాశీలకంగా కనిపించారు. కొద్ది రోజులుగా నియోజకవర్గంలో తన కార్యకలాపాలను ప్రారంభించిన ఆయన అకాల మరణం చెందడంతో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు విషాదంలో మునిగిపోయారు.

నేడు ఈర్లపూడిలో అంత్యక్రియలు

రఘునాథపాలెం, మే 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో బుధవారం జరగనున్నాయి. మూడు తరాలుగా మదన్‌లాల్ కుటుంబ సభ్యులు ఈర్లపూడిలో నివాసం ఉంటున్నారు. వైరా ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించిన సమయంలోనూ మదన్‌లాల్ తరుచూ స్వగ్రామానికి వచ్చి ఇక్కడి వారితో కలిసి మాట్లాడే వారు. ఆయన భౌకకాయన్ని బుధవారం ఉదయం ఖమ్మం నివాసం నుంచి ఈర్లపూడికి తీసుకురానుండగా.. అంతిమయాత్ర కోసం కార్యకర్తలు, బంధువుల మధ్య ఏర్పాట్లు చేస్తున్నారు. అంత్యక్రియల కార్యక్రమానికి బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు తన్నీరు హరీ‌ష్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ హాజరుకానున్నారు. మదన్‌లాల్ భౌతికకాయాన్ని ప్రముఖులు, ప్రజల సందర్శనార్థం మంగళవారం ఖమ్మం కవిరాజ్‌నగర్‌లోని ఆయన నివాసంలో ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్‌జేసీ కృష్ణ, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ మదన్‌లాల్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ మదన్‌లాల్ మరణం గిరిజన, బడుగు బలహీన వర్గాల ప్రజలకు తీరని లోటుగా పేర్కొన్నారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఆయనెంతో కృషి చేశారన్నారు. మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ మదన్‌లాల్ మరణం తాను ఊహించలేదన్నారు. ఎంతో ఆరోగ్యంగా ఉండి ప్రజలతో మమేకమై పని చేసిన వ్యక్తిగా కీర్తించారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలతో మదన్‌లాల్ కలిసి పనిచేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం మదన్‌లాల్ ఎంతో కృషి చేశారని ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. చివరి వరకు పార్టీ కోసం పనిచేశారన్నారు.


మదన్‌లాల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నామా


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఫోన్‌లో పరామర్శించిన కేసీఆర్

మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మరణం గురించి తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. మదన్‌లాల్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో ఓదార్చారు. మదన్‌లాల్ భౌతికకాయం వద్ద నివాళులర్పించేందుకు వచ్చిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన ఫోన్ నుంచి కేసీఆర్‌కు ఫోన్ చేసి.. మదన్‌లాల్ కుమారుడు మృగేందర్‌లాల్‌తో కేసీఆర్‌తో మాట్లాడించారు. మదన్‌లాల్ ఆకస్మిక మరణం తనను కలచి వేసిందని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ ఫోన్‌లో ఓదార్చారు.

మంత్రులు తుమ్మల, పొంగులేటి సంతాపం

వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మృతిపట్ల రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వేర్వేరుగా సంతాపం తెలిపారు. మదన్‌లాల్ నిబద్ధత కలిగిన నాయకుడని, ఎమ్మెల్యేగా వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషిచేశారని తుమ్మల పేర్కొన్నారు. మదన్‌లాల్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రెవెన్యూ, గృహనిర్మాన శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మృతిపట్ల సంతాపం తెలిపారు. వైసీపీ, టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మదన్‌లాల్ మృతి వారికుటుంబానికి తీరనిలోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. అలాగే కేంద్రమాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి, వైరా ఎమ్మెల్యే ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ వెర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. వైరా నియోజకవర్గంలో అనేక బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిబద్ధతతో పనిచేశారన్నారు. మదన్‌లాల్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇందిరా డెయిరీ కార్యాచరణను వేగిరం చేయాలి

» ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా డెయిరీకి సంబంధించిన కార్యాచరణను వేగవంతం చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి ఇందిరా మహిళా డెయిరీ, రాజీవ్ యువ వికాసం, మహిళా మార్ట్ ప్రారంభోత్సవంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా డెయిరీ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. యూనిట్ల కోసం పశుగ్రాసం పెంపకానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇదివరకే ఉన్న గేదెల పాల ఉత్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ నెల వెయ్యి గేదెలు కొనుగోలుకు కార్యాచరణ చేయాలని, జూలై నుంచి కొనుగోలు ప్రారంభం కావాలని కలెక్టర్ సూచించారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల వివరాలను కార్పొరేషన్, బ్యాంకుల వారీగా సిద్ధం చేయాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులు పరిశీలన తర్వాత ఆయా బ్యాంకులకు అందజేయాలన్నారు. ఇప్పటివరకు 7,722 ప్రతిపాదనలు బ్యాంకులకు పంపించగా, 5,183 ప్రతిపాదనలకు అనుమతి లభించిందన్నారు. జూన్ 2న అన్ని వర్గాలకు సంబంధించి రాజీవ్ యువ వికాసం మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో అన్ని హంగులతో మహిళా మార్ట్ ప్రారంభోత్సవానికి సిద్ధమైనట్టు కలెక్టర్ అన్నారు. మిగిలిన ఏర్పాట్లు ఉంటే బుధవారం ఉదయం లోపు పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్డీవో ఎన్.సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయలక్ష్మి, ఎల్డీఎం శ్రీనివాస రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్. శ్రీనివాసరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పురందర్ తదితరులున్నారు.

మోదీ నాయకత్వంలో దేశం ముందుకెళ్తోంది

» వన్‌నేషన్ వన్ ఎలక్షన్ రాష్ట్ర కన్వీనర్ కరణం పరిణితి



సమావేశంలో మాట్లాడుతున్న కరణం పరిణితి

ఖమ్మంచర్చికాంపౌండ్, మే27(ఆంధ్రజ్యోతి): దేశానికి బలమైన ప్రధాన మంత్రి దొరికాడని, నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ముందుకెళ్తుందని వన్‌నేషన్ వన్ ఎలక్షన్ రాష్ట్ర కన్వీనర్ కరణం పరిణితి పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం నగరంలో వన్‌నేషన్ వన్ ఎలక్షన్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వన్‌నేషన్ వన్ ఎలక్షన్ రాష్ట్ర కన్వీనర్ కరణం పరిణితి మాట్లాడుతూ దేశంలో వివిధప్రాంతాల్లో ఒక్కోసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల కొన్ని కోట్ల ప్రజాధనం వృధా అవుతుందన్నారు. ఏడాదిలో 165 రోజులు ఎన్నికల కోడ్‌పేరుతో ప్రభుత్వ పనులకు అవరోధాలు కలిగే అవకాశం ఉన్నందున వన్‌నేషన్ వన్ ఎలక్షన్ విషయంలో ప్రజలను జాగ్రత్త పరచాలని కోరారు. ప్రభుత్వ పథకాలు కూడా ఎన్నికల కోడ్ తో ప్రజలుఅందుకోలేకపోతున్నారన్నారు. ప్రజాశ్రేయస్సు దృష్యా వన్‌నేషన్ వన్ ఎలక్షన్ కు ప్రజలందరు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్రనాయకులు బాదంపుడి ప్రవీణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, మారుతి వీరభద్రప్రసాద్, మంద సరస్వతి, తుమ్మ శివ, స్వర్ణ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

వెంగళరావు ప్రాజెక్టు
అలుగు పునర్నిర్మాణం ఎప్పుడో?

» ఐదేళ్ల క్రితం ధ్వంసం
» తాత్కాలిక చర్యలతోనే పంటలకు అందనున్న సాగునీరు


అలుగు దిగువ భాగంలో కోతకు గురైన భూమి

చంద్రుగొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండలంలోని వెంగళరావు ప్రాజెక్టు అలుగు నిర్మాణానికి టెండర్లు పూర్తైనా పనులు ఇప్పుడే ప్రారంభించే పరిస్థితులు కానరావడం లేదు. దాంతో ఆయకట్టు రైతుల్లో నిరాశ అలుముకుంది. వర్షాకాలంలో నిర్మాణ పనులు చేపట్టాలంటే పలు అడ్డంకులు దాటాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అది సాధ్యం కాదని అధికారులు తెలిపారు. నిర్మాణ ప్రదేశం (అలుగు) పూర్తిగా పంట భూముల మధ్య ఉండటం, వాగులు వంకలు దాటాల్సిన రావడంతో పాటు వర్షా కాలంలో ప్రాజెక్టు నుంచి అలుగు (నిర్మాణ ప్రదేశం) ద్వారా నిత్యం భారీగా వరద నీరు బయటకు పోతుండటం లాంటి సమస్యలు నిర్మాణానికి అడ్డుగా ఉంటాయి. దాంతో టెండర్లు పూర్తి అయినా వర్షాలు ముగిసేవరకు ఆ ప్రాంతంలో అడుగు పెట్టలేమని అధికారులు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. తాత్కాలిక చర్యల (మట్టికట్ట నిర్మించి)తో ప్రాజెక్టులో నీరు నిల్వచేసి ఈ సీజన్‌కు సాగునీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎనిమిది గ్రామాలకు జీవనాడిగా ఉన్న వెంగళరావు పాజెక్టు అలుగు ఐదేళ్ల క్రితం భారీ వర్షాలకు ధ్వంసం కాగా, అప్పటి నుంచి అలుగు పునర్నిర్మాణానికి ప్రయత్నం చేశారు. అయినా ఐదేళ్లుగా ప్రతిపాదనల వద్దే ఫైలు ఆగింది. అధికారికంగా రెండు వేలు, అనధికారికంగా మరో వేయి ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందిస్తూ ఎనిమిది గ్రామా ల ప్రజలకు, మత్స్యకారులకు జీవనాధారంగా ఉన్న ప్రాజెక్టు దుస్థితిని మాజీ మంత్రి జలగం ప్రసాదరావు జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకుపోయ్యారు. దాంతో కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ గత మార్చిలో ప్రా జెక్టును సందర్శించి అలుగు నిర్మాణానికి నెల రోజుల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దాంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.33.55 కోట్లు మంజూరు చేసింది. ఆ వెంటనే ఇరిగేషన్ అధికారులు టెండర్ల ప్రక్రియ చెపట్టారు. ఒకటి రెండు రోజుల్లో టెండర్లు ఫైనల్ అవుతాయని, వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాతే పనులు చేపడతామని డీఈ కృష్ణశంకర్ తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య


దుర్గాప్రసాద్ మృతదేహం

ఇల్లెందు టౌన్, మే27(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఇల్లెందు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లెందు పట్టణంలోని 14వ నెంబరు బస్తీకి చెందిన దుర్గాప్రసాద్‌పానీ అలీయాస్ రాజు(42)అనే ఆటో డ్రైవర్ మంగళవారం మధ్యాహ్నం గుడికి వెళ్తున్నట్లు ఇంటిలో చెప్పి వెళ్లాడు. ఎంతకు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పట్టణంలోని వివిధ ప్రాంతాలలో గాలించారు. 14వ నంబరు బస్తీకి సమీపంలోని ఓసీ ప్రాంతంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతిడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గత ఆరు నెలల క్రితమే పెద్ద కుమార్తెకు వివాహం జరిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిగా తెలియరాలేదు. ఈ మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సత్తుపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సత్తుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సత్తుపల్లికి చెందిన కల్యాణ్(25) స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి సొంత పని నిమిత్తం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనం గంగారం వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న డీసీఎం వ్యాన్ బేతపల్లి అతడి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు ఖమ్మం తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేపలగడ్డలో చోరీ

» 33 గ్రాముల బంగారం, రూ. 60 వేల అపహరణ

సుజాతనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ మండలంలోని వేపలగడ్డలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన సుజాతనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన ఫిర్యాదు ప్రకారం.. స్థానిక వేపలగడ్డ గ్రామానికి చెందిన మల్లెల బాల చెన్నారెడ్డి తన కుటుంబంతో కలిసి ఆదివారం భద్రాచలం బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం గమనించి, ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. అందులో ఉన్న 33 గ్రాముల బంగారపు వస్తువులు, రూ.60 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపాడు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిదానపురంలో...

మధిరరూరల్, మే27(ఆంధ్రజ్యోతి): మధిర మండలం నిదానపురం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామ నడిబొడ్డులో ఉన్న రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడి నగదు ఎత్తుకెళ్లారు. స్థానిక వైఎస్ విగ్రహ సెంటర్‌లో షేక్. నాగుల్‌మీరాకు చెందిన చికెన్‌షాపు, అమరకృష్ణారెడ్డికి చెందిన మద్యం బెల్ట్, కూల్‌డ్రింక్ షాపులు పక్కపక్కనే ఉన్నాయి. ఈషాపులపై ఉన్న రేకులను కత్తిరించి చికెన్‌షాపులోని రూ.7వేల నగదు, బెల్ట్ షాపులోని 15 క్వార్టర్ల మద్యం సీసాలను దొంగలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం దుకాణ యజమానులు వచ్చిచూసే సరికి దొంగతనం జరిగిన విషయం గమనించి మధిరరూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గంజాయి పట్టివేత ?

● పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు!

జూలూరుపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని జూలూరుపాడు పోలీసులు పట్టుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రానికి చెందిన కొందరు యువకులు మినికంటైనర్‌లో గంజాయిని తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో జూలూరుపాడు పోలీసులు సోమవారం పట్టుకున్నట్లు తెలిసింది. వ్యాన్‌లో భారీ మొత్తంలో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. గంజాయిని ఎక్కడ కొనుగోలు చేశారు.. ఎక్కడికి తరలిస్తున్నారని... ఇంకెవరైనా ఉన్నారనే కోణంలో విచారణ చేస్తున్నారు.

సామాజిక చైతన్యం కలిగించాలి: డీఈవో

పాల్వంచ, మే 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందిస్తూ వారిలో సామాజిక చైతన్యం కలిగించాలని డీఈవో వెంకటేశ్వరాచారి, పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్‌లు ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న బయోలాజికల్ సైన్స్ టీచర్ల రెండో స్పెల్ ఐదు రోజుల శిక్షణా తరగతులకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్నాలజీని ఉపయోగించుకుని బోధనలో నూతన పద్ధతులను అవలంభించాలని సూచించారు. ఫోక్సో మానవ అక్రమ రవాణా, డ్రగ్స్‌వినియోగం, సైబర్ నేరాలపై పాల్వంచ డీఎస్పీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ పద్మలత, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు సురేష్‌బాబు, తోటమల్ల, డీఆర్‌పీలు ఎడారి ప్రకాష్, పరమయ్య, జయబాబు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.


డీఎస్పీ సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, మే 27(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయంలో మంగళవారం వివిధశాఖల జిల్లా అధికారులు, వైద్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు చేపడుతున్న చర్యలు, తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వైద్యశాఖాధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలంలో మలేరియా, మెదడువాపు, డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి నిలువ నీటిని శుభ్రం చేయడంతో వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. అన్ని ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ కిట్లు, మందులు అందుబాటులో ఉంచాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి పరీక్షల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు తగిన వైద్యం అందించాలన్నారు.

వసతిగృహాల్లో కిచెన్‌షెడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నియంత్రణపై వాట్సాప్ సందేశాలు గ్రూపుల్లో పోస్టు చేయడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా మురుగు గుంతల్లో నీరు ఉంటే అక్కడ ఇంకుడు గుంతల నిర్మాణాలతో పాటు అజోల్లా పెంపకం చేపట్టాలన్నారు. కార్యక్రమం లో టీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, జిల్లా వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, డీసీహెచ్‌వో రవిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి, జిల్లా మలేరియా అధికారి స్పందన, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, పాల్వంచ మునిసిపల్ కమిషనర్ సుజాత, మిషన్ భగీరథ ఈఈలు తిరుమలేష్, నళిని, జిల్లా అదనపు వైద్యాశాఖ అధికారి జయలక్ష్మి, జిల్లా అధికారులు, జిల్లా వైద్యశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేరెల్లి ప్రవీణ్‌పై పీడీయాక్ట్

ఖమ్మం, మే 27 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధమైన కార్యకలాపాల్లో పాల్గొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఖమ్మం నగరానికి చెందిన రౌడీషీటర్ పేరెల్లి ప్రవీణ్‌పై ప్రీవెంటీవ్ డిటెక్షన్ (పీడీయాక్ట్) అమలు చేసినట్టు సీపీ సునీల్‌దత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితుడు భూకబ్జాలు చేయడం, బెదిరింపులకు పాల్పడటం, డబ్బులు డిమాండ్ చేయడం లాంటి వరుస నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నేపథ్యంలో వాటికి శాశ్వతంగా చెక్ పెట్టడానికి పీడీ యాక్ట్ అమలు చేసి హైదరాబాద్ చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్టు తెలిపారు. గతంలో ప్రవీణ్ ఓ హత్య కేసుతోపాటు దోపీడీ, దౌర్జన్యాలు, హత్యాయత్నం లాంటి మూడు కేసుల్లో నేరాలు రుజువు కావడంతో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తూ సత్ప్రవర్తనతో జైలు నుంచి వి డుదలయ్యాడన్నారు. బయటకొచ్చిన అతడు మళ్లీ నేర ప్రవృత్తిని కొనసాగించాడని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే ఇతడిపై ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో సుమారు 30 కేసులు నమోదవగా 21 కేసుల్లో అరెస్ట్ అయి జైలుకు వెళ్లి బె యిల్‌పై తిరుగుతూ ఏదైనా భూ వివాదం ఉం టే తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించడం, బాధితులపై దౌర్జన్యం చేయడం, అడ్డుకున్నవారిని చంపుతానని బెదిరించడం నైజంగా మా ర్చుకున్నాడని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వరుస నేరాలకు పాల్పడినట్టయితే వారిపైన పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు.

వినాయకపురంలో కస్తూరి జింక అవశేషాల కలకలం?

» ఓ మత బోధకుడి ఇంట్లో పట్టుకున్న అటవీశాఖాధికారులు
» అవి అసలువా? నకిలీవా? తేల్చేందుకు ల్యాబ్‌కు
» భార్య తరపు వారిచ్చిన సమాచారంతో వెలుగులోకి


అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న అవశేషాలు

అశ్వారావుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): మత బోధకుడి ముసుగులో ప్రజలను మభ్యపెడుతూ.. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తి గుట్టును అతడి భార్య తరపు వారు రట్టుచేసిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో జరిగింది. వినాయకపురానికి చెందిన సదరు మత బోధకుడు.. అటవీ జంతువుల అవయవాలు, ఇతర అక్రమవ్యాపారులు చేస్తుంటాడని, అతడి ఇంట్లో ఏవో గుర్తు తెలియని వస్తువులున్నాయని, వాటి నుంచి సుగంధ పరిమళం వెదజల్లుతోందంటూ.. అతడి భార్య తరుపు బంధువులు కొందరు అటవీశాఖాధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అశ్వారావుపేట రేంజర్ మురళి ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది సోమవారం అర్ధరాత్రి వినాయకపురంలోని మత బోధకుడి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో అరుదైన కస్తూరి జింకకు చెందినవిగా భావిస్తున్న బాల్స్ లాంటి 13 అవశేషాలను గుర్తించారు. వాటి విలువ లక్షల్లోనే ఉంటుందని చెబుతుండగా.. అవి అసలువేనా? లేదంటే ప్రజలను మాయచేసేందుకు నకిలీవి రూపొందించారా? తెలుసుకునేందుకు అటవీశాఖాధికారులు వాటిని పరీక్షల నిమిత్తం సీసీఎంబీ ల్యాబ్‌కు పంపారు. సదరు వ్యక్తి మత బోధకుడిగా కొద్ది రోజులు చేసి అనేక ప్రాంతాల్లో పరిచయాలు పెంచుకుని.. గుప్తనిధులు, ఇతరత్రా పూజలు చేయడంతో పాటు.. అటవీ జంతువులు, పలు అసాంఘిక కార్యకలాపాలు, దందాలు సాగిస్తున్నట్టు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారాల్లో అతడితో పాటు వెనుక చాలా మంది పనిచేస్తుండవచ్చుననే కోణంలోనూ విచారణ చేపట్టారు. అయితే ఈ సంఘటనకు మూడు రోజుల క్రితం సదరు మత బోధకుడు మరో వివాహితతో ఇంట్లో కలసి ఉన్న సమయంలో అతడి భార్య ఇద్దరినీ పట్టుకొని దేహశుద్ధి చేయగా.. గాయాలపాలై అతడు ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలోనే తన ఇంట్లో అటవీశాఖాధికారులు సోదాలు చేస్తున్న విషయం తెలుసుకున్న సదరు వ్యక్తి, అతనితో పాటు ఉన్న మరో వ్యక్తి ఆసుపత్రి నుంచి పరారయ్యారని తెలుస్తోంది. ఈ మత బోధకుడితో పాటు అతడితో కలిసి ఉండే అనేక మంది తరుచూ ఖరీదైన కార్లలో తిరుగుతూ కనిపిస్తున్నారని స్థానికంగా చర్చ జరుగుతుండగా.. ఇటు పోలీసులు, అటు అటవీశాఖాధికారులు లోతైన విచారణ చేపడితే అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు. అయితే కస్తూరి జింకలు హిమాలయాల ప్రాంతాలలో తప్ప మన ప్రాంతంలో కనిపించవని, ఆ జింకల అవయవాలను పర్‌ఫ్యూమ్స్ లాంటి వాటిలో వినియోగిస్తారని రేంజర్ మురళి చెబుతున్నారు. అలాంటి జింకల అవయవాలు అతడికి ఎలా లభించాయి? అవి నిజమైనవేనా? లేదంటే పూజల పేరుతో జనాన్ని మోసం చేయడానికి నకిలీవి సృష్టించారో తెలుసుకునేందుకు ల్యాబ్‌కు పంపామని తెలిపారు.

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

» పాల్వంచ మండలంలో పర్యటన
» కూలీలకు అందుతున్న వేతనాలు, సౌకర్యాలపై ఆరా

పాల్వంచ రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం పనులు ఉపయోగపడుతున్నాయా లేదా.. రోజుకు సరాసరి ఎంత వేతనం వస్తోంది.. ఎన్ని రోజులకు వేతనాలు అందిస్తున్నారు.. పని ప్రదేశాల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయనే కేంద్ర పరిశీలక బృందం సభ్యులు పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. మంగళవారం పాల్వంచ మండలంలోని రెడ్డిగూడెం, తోగ్గూడెం, కిన్నెరసాని, జగన్నాథపురంలో కేంద్ర బృందం పర్యటించింది. పని ప్రదేశాల్లో తిరిగారు. కూలీలతో మాట్లాడారు. పలు అంశాలపై అధికారులతో చర్చించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ సభ్యులు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా అమల్లో ఉన్నాయా లేవా అనే అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఉపాధి పనుల వద్ద కూలీలకు సౌకర్యాలను కల్పించాలని ఎటువంటి అసౌకర్యాలు ఉండకూడదని సూచించారు. ఉపాధిహామీ పథకం పనుల తీరుపై కూలీలతో మాట్లాడారు. సంవత్సరానికి ఎన్నిరోజులు ఉపాధిహామీ పథకం పనులపై ఆధారపడి ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని పనులు సమకూరుస్తున్నారని అడిగారు. రోజువారి వేతనం ఎంత వస్తుందని కూలీలతో అడిగారు. చేసిన పనికి సకాలంలో వేతనాలు అందుతున్నాయా లేదా అని అడిగారు. కూలీల ద్వారా సమగ్ర సమాచారాన్ని ఉపాధిహామీ పథకం కేంద్ర మంత్రిత్వశాఖకు తెలియజేయనున్నట్లు బృందం సభ్యులు రాకేష్‌కుమార్, వివేక్ కుమార్ కేసరీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, అదనపు డీఆర్‌డీవో రవి, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఏపీఎం రాంబాబు, ఈసీలు రాజు, పుల్లయ్య పాల్గొన్నారు.


ఉపాధి కూలీల హాజరు పట్టికను పరిశీలిస్తున్న బృందం

పోడు భూమి.. పట్టా వివాదం

» ఫారెస్టు భూమిని ఆక్రమించే యత్నం
» అడ్డుకున్న ఫారెస్టు అధికారులు

మణుగూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలంలోని కట్టుమల్లారం రిజర్వ్ ఫారెస్టు భూమిని ఆక్రమించుకుని, స్థానిక ప్రజలు పోడు సాగు పనులను మంగళవారం ఆరంభించగా ఫారెస్టు అధికారులు అడ్డుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేశారు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో పోడు భూమి వ్యవహారంలో ఘర్షణలు జరగుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానికులు 70 మందికి పైగా పోడు పనులు చేపట్టగా ప్రభుత్వం నుంచి 8 ఎకరాలకు పట్టా 17 మందికి వచ్చింది. అయితే నాడు పోడు కొట్టే సమయంలో గ్రామంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రభుత్వం నుంచి ఎంత పట్టా వచ్చినా అది అందరికీ పంచాలన్న ఒప్పందం గ్రామస్థులు అంతా ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఎట్టకేలకు పట్టా కేవలం 8 ఎకరాలకు రావడంతో బాగాలు వేసుకుని తలా కొద్దిగా పంచుకోవాల్సి ఉంది. కాగా పట్టాలు వచ్చిన వారు బీఆర్ఎస్ పార్టీ వారు కావడంతో కాంగ్రెస్ ఇతర పార్టీలకు చెందిన వారు కావడంతో అసలు వివాదానికి తెర లేచింది. ఇది ఇలా ఉండగా 8 ఎకరాల భూమి ని ఆనుకుని దాదాపు మరో 20 ఎకరాల వరకు పోడు పనులు చేపట్టేందుకు స్థానికులు మంగళవారం పనులు మొదలు పెట్టారు. దీంతో రంగంలోకి దిగిన ఫారెస్టు రెంజర్ ఇతర సిబ్బంది పోడు పనులను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రేగా కాంతారావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే రేగా కాంతారావు వివాదాన్ని పరిష్కరించేందుకు మాట్లాడబోతుండగా కాంగ్రెస్ వర్గీయులు నాడు చేసుకున్న ఒప్పందం ప్రకారం భూమిని అందరికీ ఎందుకు పంచలేదని ప్రశ్నించారు. ఈక్రమంలో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారుల సర్వేల్లో తప్పులు చోటు చేసుకుని ఉంటాయని తెలిపారు. అయితే ఈ విషయంపై ఫారెస్టు ఆక్రమణలకు గురైతే ఫారెస్టు శాఖ తరుపున చర్యలను చేపడతామని రేంజర్ ఉపేంద్ర పేర్కొన్నారు. కాగా ఫారెస్టు అధికారులు పోడు పనులు చేపడుతున్న ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇక్కడ ప్లానిటేషన్ పనులు చేపట్టి ఫారెస్టు భూమిని సంరక్షణ చర్యలను చేపడతామని స్పష్టం చేశారు. దీంతో ఈ వివాదం సద్దుమణింది.


స్థానికులతో మాట్లాడుతున్న రేగ కాంతారావు

తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మట్టపర్తి

చుంచుపల్లి, మే27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా , ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీగా చుంచుపల్లి మండలానికి చెందిన మట్టపర్తి రమేష్ ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నికయ్యారు. తెలంగాణ ఒలింపిక్ భవన్‌లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్టేట్ ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మల్లారెడ్డి సమక్షంలో నూతన కమిటీ నియామకం చేపట్టారు. తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎస్.అశోక్(హైదారాబాద్), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రతాప్‌రెడ్డి(హైదారాబాద్), ఉపాధ్యక్షుడుగా మట్టపర్తి రమేష్(ఖమ్మం)తో పాటు, మరో ముగ్గురుతో పాటు మొత్తం 16 మంది నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీగా మట్టపర్తి రమేషను ఎన్నుకొని బాధ్యతలు అప్పగించారు. రమేష్ ఎన్నిక పట్ల మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ పుట్ట శంకరయ్య, కార్యదర్శి క్రిష్టఫర్‌బాబు, వివిధ క్రీడా అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి ఆర్థికసాయం

తిరుమలాయపాలెం,మే27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వివిధ కారణాలతో మరణించిన మృతుల కుటుంబాలకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10వేలు అందించారు మండలంలోని 40గ్రామపంచాయతీల్లోని 27 కుటుంబాల వారికి కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకరరెడ్డి, రామసహాయం నరేష్‌రెడ్డి అందించారు మండలంలోని కాకరవాయి, రఘునాధపాలెం, బచ్చోడు, పైనంపల్లి, రాజారం,జూపెడ, జల్లేపల్లి, మహ్మదాపురం తదితర గ్రామాల్లో ఆర్థికసాయం అందించారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుద్ద కనకయ్య, గూడూరు వెంకన్న, గూడూరు ఉపేందర్, మాజీ ఎంపీపీ మంగిలాల్, ఏఎంసీ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, బానోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



‘భూభారతి’లో సర్వేయర్లే కీలకం

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- సర్వేయర్ల శిక్షణలో దిశానిర్దేశం

ఖమ్మంకలెక్టరేట్, మే27(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంలో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం టీటీడీసీ భవనంలో సర్వే ల్యాండ్ రికార్డుశాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లకు మొదటిబ్యాచ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టం, భూ సమస్యలపై సమగ్ర అవగాహన కల్పించుకోవాలన్నారు. భూ మ్యాప్, నక్షా, భూహద్దులు తదితర విషయాలపై స్పష్టత సర్వేయర్ల అవసరమని వారి విధులపై అవగాహన కల్పిస్తు కలెక్టర్ వారికి దిశానిర్దేశం చేశారు. సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు వీలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల మంది లైసెన్సుడ్ సర్వేయర్లను ఎంపిక చేసి, వారికి శిక్షణ అందించి అర్హత సాధించిన వారికి లైసెన్సులను జారీ చేయనుందన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారికి శిక్షణ కోసం ఎంపిక చేశామని అన్నారు. 50 రోజుల పాటు భూముల సర్వేలో నిష్ణాతులు, అనుభవజ్ఞులైన వారు శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం పరీక్షను నిర్వహిస్తుందని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అయిన లైసెన్సుడ్ సర్వేయర్లుగా ప్రభుత్వం గుర్తింపు పత్రాలను జారీ చేస్తుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం సర్వేయర్లకు శిక్షణ మెటీరియల్‌ను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ ఏడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను తీర్చిదిద్దాలి

భవిత కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో భవిత కేంద్రాల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సమీక్షించారు. జిల్లాలో 8భవిత కేంద్రాలు, 14నాన్ భవిత కేంద్రాలు ఉన్నాయన్నారు. రాబోయే 20 రోజుల్లోపు 8భవిత కేంద్రాల్లో టాయిలెట్లు, వాష్‌రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆకర్షణీయ పెయింటింగ్ వేయాలన్నారు. జిల్లాలో బడిబాట కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జీరో నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలల్లో వసతుల కల్పన పనులు వెంటనే చేపట్టాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో భోజనంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. రుచి శుచికరమైన భోజనం పిల్లలకు అందేలా చూడాలన్నారు. సిబ్బంది, పిల్లలతో కలిసి భోజనం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సత్యనారాయణ, సీఎంఒపాల్గొన్నారు.

బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంఖానాపురంహవేలి, మే27 (ఆంధ్రజ్యోతి): దేశభవిష్యత్‌ను నిర్ణయించే స్థాయికి ఆడపిల్లలు ఎదగాలని అందుకోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్‌ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా విద్యా శాఖ ఖమ్మం, ప్రజ్వల స్వచ్ఛంద హైదరాబాద్ ఆధ్వర్యంలో రిక్కాబజార్ ఉన్నత పాఠశాలనందు కేజీబీవీ, మోడల్ స్కూల్, సాంఘీక సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయనిలకు నిర్వహిస్తున్న రెండురోజుల శిక్షణంలో మాట్లాడారు. చదువుతో పాటు మానవతా విలువలు కూడా నేర్పించాలని, పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ కండక్ట్ చేసినప్పుడు పర్సనల్ విషయాలను చర్చించాలని చెప్పారు. పిల్లలు ఏదైనా ప్రమాదం ఉందని గమనిస్తే వెంటనే 1098, 100, 181, 1930 లాంటి టోల్‌ఫ్రీనంబర్స్‌ను ఉపయోగించాలి అని సూచించారు. కార్యక్రమంలో డీఈవో సత్యనారాయణ,జీసీడీవోతులసి,శిక్షణ కోర్స్ కోఆర్డినేటర్ అజిత, కోఆర్డినేటర్ సురేష్ కుమార్, కోఆర్డినేటర్ రాము ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కేజీబీవీ, మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్ స్కూల్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3నుంచి పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మంఖానాపురంహవేలి, మే27 (ఆంధ్రజ్యోతి): జూన్ 3నుంచి పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్ట డీఈవో కె.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు పరీక్షకేంద్రాల్లో 1048మంది పరీక్షలు రాస్తున్నట్టు తెలిపారు. ఎస్ఎస్‌సీ ప్రభుత్వ పాఠశాల, రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాల, శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు డీఈవో తెలిపారు.

మీ పనులు మాకొద్దు

- ఇప్పటికీ చెల్లింపులు కాని 2022 ‘మన బస్తీ మన బడి’ బిల్లులు
- ఇంజనీరింగ్,అకౌంట్స్,ఎగ్జామినర్‌కు పొసగని వైనం
- ఖమ్మంలో పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- టెండర్లు కాకుండానే నిలిచిన 34 అభివృద్ధి పనులు



నేటివరకూ బిల్లులు రాని పాఠశాల

ఖమ్మంసంక్షేమవిభాగం,మే27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు. ఖమ్మం నగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్, ఎకౌంట్స్, ఎగ్జామినర్లకు పొసగని కారణంగా మీ పనులు మా కొద్దు బాబోయ్ అంటూ కనీసం టెండర్లు వేసేందుకు ముందుకు రావటం లేదు. ఇటీవల కాలంలో 34అభివృద్ధి పనులకు టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.దీంతో రెండు నుంచి మూడుసార్లు నోటిఫికేషన్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతోఖమ్మంలోని కార్పొరేటర్లు వారిని బతిమిలాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏకంగా మేయర్ సైతం కాంట్రాక్టర్లను టెండర్లు వేయండి అంటూ విన్నవిస్తుండటం సమస్య తీవ్రతను తెలుపుతుంది.

డ్రాయింగ్ బ్రాంచ్‌లో సమస్యలే..

ఓకాంట్రాక్టర్ అభివృద్ధి పని చేస్తే ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ అనంతరం కేఎంసీలోని డ్రాయింగ్ బ్రాంచిలో సరైన సమయానికి మెజర్‌మెంట్‌బుక్(ఎంబీ) నమోదు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ ఒక ఫైల్ ముందుకు కదలాలంటే నెలలు పడుతోంది. చేసిన పనికి సంబంధించి పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులకు కమిషన్లు అందిన తర్వాతనే డ్రాయింగ్ బ్రాంచిలో ఎంబీలు రికార్డులు జరుగుతున్నాయి. డీఈ, ఈఈ పరిశీలన తర్వాత కమిషనర్‌కు వరకు వెళ్తుంది. అక్కడ నుంచి ఎకౌంట్స్ విభాగానికి వెళ్లిన తర్వాత అభివృద్ధి పని ఆర్థిక విషయాలను నమోదు చేస్తూ, బడ్జెట్ఇతర పూర్తివివరాలు నమోదు చేసిన తర్వాత ఎగ్జామినర్‌కు వెళ్తుంది. తుది పరిశీలన తర్వాత ఎకౌంట్స్ విభాగానికి చెక్కురాసిన తర్వాత కమిషనర్ ద్వారా సంతకాలు పెట్టి పనులు చేసిన కాంట్రాక్టరుకు ఇవ్వాలి.

సమన్వయలోపం

నగర పాలక సంస్థలో డ్రాయింగ్ బ్రాంచి నుంచి ఎగ్జామినర్ వరకు సమన్వయలోపం కనిపిస్తోంది. ఇంజనీరింగ్ అధికారులు, ఎకౌంట్స్ విభాగం, ఎగ్జామినర్‌కు పొసగకపోవటంతో కాంట్రాక్టర్లు ముప్పు తిప్పలు పెడుతున్నారు. ఎగ్జామినర్ చెక్కులు రాసే సమయంలోకి బిల్లు రాగానే తిరిగి డ్రాయింగ్ బ్రాంచ్‌కు వెళ్లాల్సిన అంశాలను చూపిస్తున్నారు.ఇంజనీరింగ్,ఎకౌంట్స్, ఎగ్జామినర్‌లు ఎవ్వరికి వారే వ్యక్తిగత విషయాలతో కాంట్రాక్టర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఊళ్లో బడి నిర్మాణం చేస్తే గ్రామంలోని విద్యార్థులకు ఉపయోగం ఉంటుందని 2022లో మల్లెమడుగులో మననగరం, మనబడిలో నిర్మాణాలు పూర్తిచేసిన స్థానిక వ్యక్తికి నేటి వరకు బిల్లులు చెల్లించలేదు.బడి నిర్మాణం చేసినందుకు సహకరించాల్సిన అధికారులు మూడేళ్లగా బిల్లులు చెల్లించటం లేదు.

కమిషనర్ సమయం వృథా

డ్రాయింగ్‌బ్రాంచినుంచి ఎగ్జామినర్ వరకు సరైన క్రమపద్ధతిలో ఇంజనీరింగ్ దస్త్రాల నిర్వాహణ లేక పోవటంతో కేఎంసీ కమిషనర్‌కు సమయం వృథా జరుగుతోంది. ఒకపని పేమెంట్స్‌కోసం రెండునుంచి మూడుసార్లు నోట్‌ఫైల్స్ మార్చి మార్చి పంపటంతో ప్రతిసారి కమిషనర్ ఒకే పనిని పదేపదే చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. డ్రాయింగ్‌బ్రాంచి,ఇంజనీరింగ్,ఎకౌంట్స్ విభాగాలు తీరుతో సమయం వృథా జరుగుతుంది.

కలెక్టర్ నుంచి విడుదలైన నిధులకు కిరికిరి

2022లో పూర్వకలెక్టర్ గౌతమ్ పనిచేసిన కాలంలో మన బస్తీమన బడి కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరంలోని ప్రభుత్వ పాఠశాల్లో అదనపు తరగతి గతులు, వంటశాలలు నిర్మాణాలు జరిపారు. తర్వాత విద్యాశాఖ నుంచి కలెక్టర్ ద్వారా ఖమ్మం నగర పాలక సంస్థలోని బ్యాంకు ఖాతాలకు బిల్లులు జమ జరిగాయి. కానీ ఇంజనీరింగ్ అధికారులు, ఏకౌంట్స్ అధికారుల బాధ్యతా రాహిత్యంతో 2022 మన బస్తీ మన బడి బిల్లులు నేటి వరకు నిర్మాణాలు జరిపిన వారికి అందలేదు. గ్రామంలో బడి నిర్మాణం జరిపితే భవిష్యత్‌లో విద్యార్థులకు మంచి జరుగుతుందని నిర్మాణాలు చేపట్టిన వారు మూడేళ్లుగా కేఎంసీ చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు.

నేడు గ్రానైట్ టైల్స్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం

ఖమ్మంఖానాపురంహవేలి, మే27 (ఆంధ్ర జ్యోతి):దిఖమ్మంగ్రానైట్‌టైల్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నారు. అధ్యక్షుడుగా తెడ్డు రమేష్, ప్రధాన కార్యదర్శిగా మోతుకూరి రామభద్రయ్య, కోశాధికారిగా చాగంటి శ్రీకాంత్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

బీఎస్పీతోనే బీసీలకు న్యాయం

జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఖమ్మంచర్చికాంపౌండ్, మే27(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లాలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ కేవీ కృష్ణారావు, బీఎస్పీ రాష్ట్రకార్యదర్శి పి.విజయ్‌కుమార్, మిరియాలనాగరాజు, బానోతు బద్రునాయక్, పొడగంటి రాంబాబు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లాంగ్‌జంప్‌లో స్టేట్ అథ్లెటిక్స్‌కు అలోక్



ఖమ్మంచర్చికాంపౌండ్, మే27(ఆంధ్రజ్యోతి): జూన్1న సికింద్రాబాదులో జరిగిన అండర్ 10 లాంగ్‌జంప్‌లో స్టేట్ అథ్లెటిక్స్ సబ్‌జూనియర్ మీట్‌కు ఖమ్మంనగరానికి చెందిన పునాటి అలోక్ ఎంపికైనట్టు అథ్లెటిక్స్ సెక్రటరీ షఫిక్ అహ్మద్ తెలిపారు. సర్దార్ పటేల్‌స్టేడియంలో ఈనెల 25న నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్‌లో పునాటి అలోక్ ఉత్తమప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, మే27(ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థులు ఉపకార వేతనాల కొరకు 2024-25లో ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్స్‌లో చదువుతున్న 9వ, 10వ తరగతి బీసీ విద్యార్థులు ఉపకార వేతనాల కొరకు దరఖాస్తులను సమర్పించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో లక్షా యాభై వేలు, పట్టణ ప్రాంతాలు రెండు లక్షలకు మించి ఉండకూడదని, ఆదాయ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బీసీ కుల ధృవీకరణపత్రం, బ్యాంకుపాస్‌బుక్‌కాపీలతో విద్యార్థులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కిరణ్ కుమార్‌కు డాక్టరేట్

ఖమ్మంఖానాపురంహవేలి, మే27(ఆంధ్రజ్యోతి):నగరంలోని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కె.కిరణ్ కుమార్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈసందర్భంగా ఆయన్ను పలువురు అభినందనలు తెలిపారు.

శాంతిభద్రతలకు కృషి చేయాలి

తిరుమలాయపాలెం,మే27(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కూసుమంచి సీఐ సంజీవ్ తెలిపారు. మంగళవారం మైనారిటీ జేఏసీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలు జరగకుండా ఐక్యంగా ఉండాలని కోరారు.

మహిళల ఆరోగ్య రక్షణే మా కర్తవ్యం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి



మందులు పరిశీలిస్తున్న కళావతిబాయి

ఖమ్మంకలెక్టరేట్,మే27(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆరోగ్యాన్ని పంచడమే మన కర్తవ్యమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బి కళావతిబాయి అన్నారు. మంగళవారం ఖమ్మం అర్బన్ పాత మునిసిపాలిటిలో ఆరోగ్య మహిళాక్లీనిక్‌ను ఆమె సందర్శించారు. అక్కడ మెడికల్ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్, వైద్యశాఖ సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ‘ఆరోగ్య మహిళా’ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతి మంగళవారం ఉచితంగా కార్పోరేట్ ఆసుపత్రుల స్థాయిలో మహిళలకు నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బందితో పరీక్షలు, మందులు అందిస్తోందన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు ఆరోగ్యం పట్ల ఇస్తున్న ఆరోగ్యవిద్యపై అవగాహన పెంపొదించుకోవాలన్నారు.వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నివారణ చర్యలను తెలుసుకొని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవిశ్రీ, డాక్టర్ మెహెనాజ్, గురువమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కోర్టు సమీపంలోని పల్లె దవాఖాన ‘ఆయుష్మాన్‌ఆరోగ్య మందిర్, ప్రభుత్వ డిస్పెన్సరిని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు.

సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చెన్నారం అధ్యక్షుడు వందనపు నాగేశ్వరరావు

నేలకొండపల్లి, మే27(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల నంచి రైతులకు అందుతున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెన్నారం సహకార సంఘం అధ్యక్షుడు వందనపు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు నాగేశ్వరరావు రైతులకు జీలుగువిత్తనాలను పంపిణీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీ 50శాతంపోను 30కేజీల బ్యాగును రూ.2137.50, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని నాగేశ్వరరావు చెప్పారు.కార్యక్రమంలో కార్యదర్శి మూర్తి,డైరెక్టర్లు పాల్గొన్నారు.



జీలుగులు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు

పశువును రక్షించిన డీఆర్ఎఫ్

ఖమ్మంసంక్షేమ విభాగం, మే27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓపశువు ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో ఇరుక్కుపోయింది. స్థానిక జవాన్ డీఆర్ఎఫ్ బలగాలకు సమాచారం అందించటంతో నిమిషాల్లో వచ్చిన డీఆర్ఎఫ్ బృందం వెను వెంటనే పశువును సురక్షంగా బయటకు తీశారు. ఖమ్మం నగరంలోని 26వ డివిజన్‌లో ఈ ఘటన జరగ్గా స్థానిక జవాన్ కేఎంసీ డీఆర్ఎఫ్ బృందానికి సమాచారం అందించారు. పిట్టల బాబురావు, బండి శివశంకర్, నారపొంగు వీరబాబు పశువును సురక్షంగా బయటకు తీశారు. ఈవీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఉపాధి వేతనాలు విడుదల చేయాలి

కొణిజర్ల,మే27(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా పని చేసిన కూలీలకు వేతనాలు విడుదల చేయాలని వ్యవసాయకార్మికసంఘం రాష్ట్రకమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని లక్ష్మీపురం, పెద్దరాంపురం, మేకాలకుంట, ఉప్పలచలక గ్రామాల్లో కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ప్రసాద్, బోయినపల్లి శ్రీనివాసరావు, కాపూరి సత్యనారాయణ, బానోతుహరిచంద్,కనకయ్య,నాగయ్య,వెంకటేశ్వర్లు,నాగమణి పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

కారేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి బట్టు అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. జీలుగులు 250క్వింటాలు, జనుములు 50క్వింటాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగులు 30కేజీల బస్తా 50శాతం సబ్సిడీపై రూ.2137కి లభిస్తుందని, జనుములు 40కేజీల బస్తా 50శాతం సబ్సిడీతో రూ.2510లభిస్తుందన్నారు. కావాల్సినవారు పట్టదారు పాసుపుస్తకం, సంబంధిత రైతు ఆధార్ కార్డ్ జిరాక్స్‌తో వచ్చి కావాలిసన విత్తనాలు తీసుకోవచ్చన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

తల్లాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు దైనందిన కార్యక్రమాలతో పాటు యోగా సాధన చేయడం వల్ల ఎంతో ఆరోగ్యవంతంగా జీవించవచ్చని హోమియో వైద్యాధికారి డాక్టర్ నీలిమ తెలిపారు. మంగళవారం తల్లాడ రైతువేదికలో యోగాసనాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతీరోజు యోగా చేయడం ద్వారా మానసిక ఆందోళనలు, బీపీ, షుగర్, గుండెజబ్బులు వంటి వాటిని నియంత్రణలో ఉంచవచ్చన్నారు. వచ్చే నెల 21న జరిగే పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఒకే భూమి ఒకే ఆరోగ్యం కోసం యోగా అనే ధ్యేయంతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో 25రోజులపాటు దశాబ్ది వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సీహెచ్‌వో భాస్కర్, హెల్త్ అసిస్టెంట్లు కె.పెద్దపుల్లయ్య, భద్రమ్మ, యోగాశిక్షకురాలు శ్రీదేవి, గౌతమి, జానీబీ పాల్గొన్నారు

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు


విత్తన నిల్వలను పరిశీలిస్తున్న ఏవో, ఎస్‌ఐ

ముదిగొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సరిత, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ అనంతరాములు హెచ్చరించారు. మంగళవారం ముదిగొండలోని పలు ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్టు కింద కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదులను తీసుకుని భద్రపర్చుకోవాలని సూచించారు. అనుమతి ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు. షాపుల యజమానులు ప్రతిరోజూ రిజిస్ట్రర్లలో స్టాక్ వివరాలను నమోదు చేయాలని సూచించారు.

ముంపుబారి నుంచి కాపాడండి

మధిరటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): లడకబజార్‌ను వరద ముంపు బారి నుంచి కాపాడాలని ఆ కాలనీ మహిళలు మంగళవారం మధిర మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మూడో రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా నిర్మించిన అండర్‌పాస్ వల్ల పాత కల్వర్ట్ మూసుకు పోయిందని వర్షం కురిసినప్పుడు వరద నీరు నేరుగా 18వ వార్డులో పలువురు ఇళ్లను ముంచెత్తుతుందని తెలిపారు. వర్షాకాలంలో ముంపు సమస్య ఎక్కువగా ఉంటుందని కావునా వరద నీరు ప్రవహించేందుకు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన కమిషనర్ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు వనపర్తి కళావతి, సాజీద, హనీఫాబీ, బేగం, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

30న జరిగే ఉపాధి కూలీల ధర్నాను జయప్రదం చేయండి

ఏన్కూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల సమస్యలపై ఈనెల 30న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడ మేరుగు సత్యనారాయన అన్నారు. మంగళవారం కేసుపల్లి, తూతక్కలింగన్నపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనిప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, పట్టణ ప్రాంత పేదలకు కూడా పనికల్పించాలని కోరారు. కూలీలకు రోజుకు రూ.600లు 200పనిదినాలు కల్పించాలన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు తాగునీరు, మెడికల్‌కిట్లుఏర్పాటు చేయలన్నారు. సంఘం నాయకుల ఇటికాల లెనిన్, ఇల్లూరి రామచంద్రయ్య, నామా కృష్ణారావు, జయరాజు, వెంకటయ్యపాల్గొన్నారు.


నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగయి

నెహ్రూకు ఎమ్మెల్యే ఘన నివాళులు

సత్తుపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పండిట్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. దేశానికి తొలి ప్రధానిగా నెహ్రూ అందించిన సేవలు మరువలేనివని అన్నారు. పంచసూత్ర ప్రణాళికను ప్రవేశపెట్టి దేశ అభివృద్ధికి నెహ్రూ బాటలు వేశారని ప్రశంసించారు. ఒక అధికారిగా, కార్యనిర్వహకుడిగా, రచయితగా, పండితుడిగా నెహ్రూ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. నాయకులు పాల్గొన్నారు.

రైతులకు భారంగా కౌలు ధరలు

▸▸ ఎకరాకు రూ. 30 వేలు

▸▸ కౌలు రైతుల మధ్య తీవ్ర పోటీ

చింతకాని, మే 27 (ఆంధ్రజ్యోతి): సాగు నీరు పుష్కలంగా ఉండడం.. మొక్కజొన్న, వరి, పత్తి పంటల ధరలు స్థిరంగా ఉండడంతోపాటు ఈ ఏడాది దిగుబడులు పెరగడంతో కౌలు భూముల ధరలకు రెక్కలొచ్చాయి. పెరిగిన యాంత్రీకరణతో వ్యవసాయరంగం సులభతరం కావడంతో రైతులు తమకున్న భూమితో పాటు మరికొంత భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేందుకు మక్కువ చూపుతున్నారు. నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతోపాటు వచ్చే వర్షాకాలం సీజన్‌లో కూడా సరిపడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో కౌలు భూములు దక్కించుకునేందుకు రైతుల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నది.

కౌలు రైతులే అధికం

మండల వ్యాప్తంగా సాగుకు అనువుగా ఉన్న భూములు 13 వేల హెక్టార్లు ఉండగా అందులో అధిక శాతం భూమిని కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా రెండు పంటలకు ఇక్కడ నేలలు అనుకూలంగా ఉండడంతో చిన్న, సన్నకారు రైతులు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని ఏడాదికి రెండు పంటలు సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటలైన పత్తి, మొక్కజొన్న సాగు సులభ, లాభదాయకంగా ఉండడంతో వ్యవసాయాన్ని కౌలు రైతులు ఇష్టంగా చేస్తున్నారు.


దుక్కు దున్నుతున్న దృశ్యం

ఎకరాకు రూ 25 నుంచి 30 వేల మధ్యలో...

రెండేళ్ల క్రితం కౌలు 15 నుంచి 20 వేల వరకు ఉన్న కౌలు ధర ఇప్పుడు 25 నుంచి 30 వేలకు చేరింది. ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తుండడం. ప్రభుత్వం వరి పంటకు బోనస్ ప్రకటించడంతోపాటు మొక్కజొన్న, పత్తి పంటల ధరలు స్థిరంగా కొనసాగుతుండడంతో భూ యాజమానులు కౌలు ధరలను పెంచుతున్నారు. ఈ యాసంగిలో మొక్కజొన్న దిగుబడులు పెరగడంతోపాటు వ్యాపారులు క్వింటా మొక్కజొన్నను రూ.2150లకు కొనుగోలు చేయడంతో రైతులకు కలిసొచ్చింది.

ముందస్తు కౌలు చెల్లింపు

కౌలు భూములను దక్కించుకునేందుకు రైతుల మధ్య పోటీ ఏర్పడింది. దీంతో భూయాజమానులు ఎవరు ముందస్తు కౌలు చెల్లిస్తే వారికే తమ భూమిని కౌలుకు ఇచ్చేందుకు కౌలు రైతుల మధ్య తీవ్ర పోటీ తలెత్తింది. భూములు దక్కించుకునేందుకు ఆర్థిక భారమవుతున్నా కౌలు రైతులు అప్పులు చేసి మరీ ముందస్తు కౌలు చెల్లిస్తున్నారు.

పోటీ పడాల్సి వచ్చింది


కోట శంకర్‌రావు
కౌలు రైతు, నేరడ

నాకున్న ఎకరం భూమితో పాటు మరో ఐదు ఎకరాల భూమిని గత మూడు సంవత్సరాల నుంచి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న. పక్క గ్రామ రైతు కౌలు భూమి కొరకు పోటీకు రావడంతో గతేడాది కన్నా రూ 5 వేలు అధికంగా చెల్లించి భూమిని కౌలుకు తీసుకున్నాను. ప్రభుత్వం కౌలు రైతులకు రైతుభరోసా ఇస్తే బాగుంటుంది.


పున్నం చందర్‌ను సన్మానిస్తున్న అధికారులు

తహసీల్దార్‌కు ఘన సత్కారం

బోనకల్, మే 27 (ఆంధ్రజ్యోతి): అంకిత బావంతో పని చేసే అధికారి అందరి మన్ననలు పొందుతారని ఆత్మ కమిటీ ఛైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు తెలిపారు. ఇటీవల బదిలీపై మహబుబాబాద్ జిల్లాకు వెళ్లిన తహసీల్దార్ పున్నం చందర్ సన్మాన సభను మంగళవారం స్థానిక సాయిబాబా కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం పున్నం చందర్ కృషి చేశారని తెలిపారు. అనంతరం తహసీల్దార్‌ను అధికారులు, ప్రజా ప్రతినిధులు, డీలర్లు, పలు రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. రమాదేవి, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, టీడీపీ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, గాలి దుర్గారావు, మోదుగు సుదీర్‌బాబు, బంధం శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు విడుదల చేయాలి

కొణిజర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా పని చేసిన కూలీలకు వేతనాలు విడుదల చేయటంలేదని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని లక్ష్మీపురం, పెద్దరాంపురం, మేకాలకుంట, ఉప్పలచలక గ్రామాలలో పర్యటించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ఉపాధి పథకాన్ని ఎత్తివేయాలని చూస్తుందని విమర్శించారు. పని చేసే ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించి, చేసిన పనికి వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు. చింతపల్లి ప్రసాద్, బోయినపల్లి శ్రీనివాసరావు, కావూరి సత్యనారాయణ, బానోతు హరిచంద్, కనకయ్య, నాగయ్య, వెంకటేశ్వర్లు, నాగమణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మధిరరూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఎం నాయకులు శీలం నరసింహారావు, మంద సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నాయకులు మధిర మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఉపాధి పనులు చేస్తున్న కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


కూలీల సమస్యలు తెలుసుకుంటున్న తాళ్ళపల్లి కృష్ణ

మార్కెట్ నిర్మాణ స్థల పరిశీలన

చింతకాని, మే 27 (ఆంధ్రజ్యోతి): చింతకాని నూతన వ్యవసాయ మార్కెట్ ప్రతిపాదిత నిర్మాణ స్థలాన్ని మంగళవారం మార్కెటింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండల పరిధిలోని మత్కేపల్లి గ్రామ రెవెన్యూలో సర్వే నెంబరు 41లోని ప్రభుత్వ భూమిని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంఎంఏ అలీం, వీరాంజనేయులు, సర్వేయర్ నవీన్, నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, మడిపల్లి భాస్కర్, బందెల నాగార్జున, నర్సింశెట్టి చలమయ్య తదితరాలు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సర్కారు బడులను బలోపేతం చేద్దాం

కారేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడులను బలోపేదం చేద్దామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల నమోదు పెంపుకోసం నిర్వహిస్తున్న ప్రజాజాత కార్యక్రమంలో మాట్లాతూ.. తల్లిదండ్రులు సర్కారు బడులపై నమ్మకం ఉంచి తమ పల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు. పి.సురేష్, కామేపల్లి మండల అధ్యక్షుడు నల్లమోతు శ్రీనివాస్‌రావు, కారేపల్లి మండల అధ్యక్షకార్యదర్శులు బి.మంగీలాల్, కృష్ణారావు, సంత్‌లాల్, ఎం.నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఏన్కూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు తెలిపారు. ప్రజాజాత కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్స్, మధ్యాహ్నభోజనం, పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.

మధిరరూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్, జిల్లా కార్యదర్శులు షేక్ నాగూర్‌వలీ, జి.రామకృష్ణ కోరారు. మంగళవారం ప్రభ్వు పాఠశాలల్లో పిల్లల నమోదుపెంపుకోసం టీఎస్‌యూటీఎఫ్‌జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచారజాత మధిర మండలంలో నిర్వహించారు. వినోద్‌రావు, వీరయ్య, యు.నాగేశ్వరరావు, షేక్ ఇబ్రహీం,బి.చెన్నయ్య, వి.కొండలరావు, ఎండీ రఫి, కృష్ణాంజనేయులు, డి.భాస్కరరావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న పారుపల్లి

చింతకాని, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి, గాంధీనగర్ కాలనీ గ్రామాల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రజాజాత నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

టీడీపీ మహానాడుకు తరలిన మధిర నేతలు

మధిరరూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి తెలుగుదేశం నేతలు మంగళవారం తరలివెళ్లారు. టీడీపీ ఖమ్మంపార్లమెంట్ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో పట్టణ, మండల నేతలు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ముందుగా మహానాడు ప్రాంగణంలోని తెలంగాణ టీడీపీ ప్రతినిధులు రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, నాయకులు చేకూరు శేఖర్‌బాబు, మల్లాది హనుమంతరావు, మారేడు పుల్లారావు, సతీష్, అంగడాల గోపి, పావులూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా మోతాదును తగ్గించాలి

ఎర్రుపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి): భూమిలో అధికంగా యూరియా వేయడం వల్ల రైతుకు ఖర్చుపెరగడమే కాక, నేలసారవంతం తగ్గిపోతుందని యూరియా మోతాదును తగ్గించాలని మధిర వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణీదేవి అన్నారు. మండలంలోని మీనవోలు గ్రామంలో గల రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుక్మిణీదేవి హాజరై రైతులకు వ్యవసాయ శాస్త్రీయ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు యూరియా వాడకం తగ్గించాలన్నారు నేలలో సేంద్రియ కర్బనశాతం పెరగాలంటే జీవ ఎరువులు, సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచాలని తెలిపారు. దీనివల్ల మిత్రపురుగులు పెరిగి నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చన్నారు. పచ్చిరొట్ట పంట దిగుబడిలో ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ఇందులో జీలుగ సాగు చక్కటి ఫలితాలు ఇస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే సబ్సిడీపై వ్యవసాయ శాఖ ద్వారా జీలుగు, జనుము విత్తనాలు సరఫరా చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో బి.సాయిశివ, శాస్త్రవేత్తలు భరత్, నాగస్వాతి, ఏఈవోలు సింధూర్, కృష్ణకుమారి పాల్గొన్నారు.